# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


## చెల్లెలు గంగమ్మకు వెంకన్న నుండి సారె

### భక్తితో సమర్పించిన టిటిడి ఛైర్మన్, ఈఓ





తిరుపతి(రవాణ),మే 10ప్రభాతవార్త:

స్వయాన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి చెల్లెలు తాతయ్యగుంట గంగమ్మ కావడంతో శనివారం సాయంత్రం టిటిడి అధికారులు సాంప్రదాయంగా సారె తీసుకువచ్చి సమర్పించారు. గంగమ్మ జాతరలో నాల్గవరోజు ఆనవాయితీగా సారె తీసుకువచ్చి సమర్పించడం జరుగుతుందని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. తిరుపతి పరిసరాల ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలను,వారి జీవనవిధనాలు ప్రతిబింబించేలా అపురూపంగా తిరుపతి గంగమ్మజాతర జరుగుతుందన్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, బోర్డు సభ్యులు గోవిందరాజస్వామి ఆలయం వద్ద నుండి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి గంగమ్మ ఆలయంవద్ద తిరుపతి ఎంఎల్ఏ శ్రీనివాసులు, ఆలయ ఈఓజయకుమార్‌కు అందజేశారు.

### దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలపై

## డిజిపి వీడియో కాన్ఫరెన్స్



తిరుపతి కార్పొరేషన్, మే 10, ప్రభాతవార్త

దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలపై రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా జిల్లా ఎస్పిలతో విడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో జరుగుతున్న శాంతి భద్రతల విషయంతో పాటు వివిధ పరిణామాలపై డిజిపి హరిష్ కుమార్ గుప్తా సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరుపతి కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు జె. వెంకట్రావు అదనపు ఎస్పీ పరిపాలన, శ్రీనివాసరావు అదనపు ఎస్పీ ఆర్మడ్ రిజర్వు, సాదిక్ ఆలీ ఎ.స్పి,సీ.ఐ, సుబ్రహ్మణ్యం సీ.ఐ, డీ.సీ.బి, రాజశేఖర్ రెడ్డి, ఆర్. ఐ. రమణారెడ్డి, ఆర్ఐ రమేష్ సీఐ కమ్యూనికేషన్‌లు పాల్గొన్నారు.

## దొరవేషంలో గంగమ్మకు మొక్కులు



తిరుపతి(రవాణ),మే 10ప్రభాతవార్త:

గంగమ్మజాతర వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం అమ్మవారి భక్తులు చిన్నపెద్దతేడా లేకుండా దొరవేషం ధరించి గంగమ్మను దర్శించుకున్నారు. శనివారం ఉదయం గంగమ్మకు ఉదయం అర్చకులు విశేష అభిషేకం చేసి అమ్మవారిని దొరవేషంలో అలంకరించారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరవధికగా ఆలయంలో భక్తులకు అమ్మవారి దర్శనం చేయించారు. తిరుపతి నగరం గంగమ్మజాతర ప్రధానవేడుక సమీపిస్తుండంతో సందడి నెలకొంది. భక్తులకు సౌకర్యాలు, క్యూలైన్ల నిర్వహణ, ఆలయంలో పరిశుభ్రతపై తిరుపతి కమిషనర్ మౌర్య, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డిఎస్పీ భక్తవత్సలం, సిఐ శ్రీనివాసులు పరిశీలించారు. ఆలయంకు విచ్చేసిన భక్తులకు ఆలయ ఈఓ జయకుమార్ ప్రశాంతంగా దర్శనంచేసుకునేలా సిబ్బందితో సేవలందించారు.






### తిరుమల,తిరుపతిలో

## కొనసాగుతున్న భద్రత



తిరుమల,మే 10ప్రభాతవార్తప్రతినిధి:

భారత్ -పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలకు, యుద్దానికి బ్రేక్ పడినా ప్రసిద్ద హిందూ పుణ్యక్షేత్రం తిరుమలతో బాటు తిరుపతి లో భద్రత పటిష్టంగా అమలుచేస్తున్నారు. పూర్తిస్థాయిలో సిఐఎస్ఎఫ్ భద్రతా దళాలు, ఆక్టోపస్ బలగాలు, పోలీసులు డేగకళ్ళతో నిఘాను కొనసాగిస్తున్నారు. ముందు జాగ్రత్తగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆలయం పరిసరాల్లో ఆక్టోపస్ దళాలు, ఏఆర్ పోలీసులు ఆయుధాలతో డేగకళ్ళతో పహరాకాస్తున్నారు. తిరుమలలో యాత్రికుల వసతిసముదాయం 3వద్ద యాత్రికులు ఉన్నపుడు ఏదేని అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఎలా తప్పించుకోవాలి,ప్రాణాలు కాపాడుకోవడంపై విస్తృతంగా మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు.

### రేణిగుంట విమానాశ్రయంలో

## పోలీసులు మాక్‌డ్రిల్



రేణిగుంట మే 10 ప్రభాతవార్త

రేణిగుంట (తిరుపతి) అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు, పోలీసు అధికారులు, సిఐఎస్ఎఫ్ అధికారులు సంయుక్తంగా శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధమేఘాలు అలుముకున్న నేపథ్యంలో విమానాశ్రయం లాంటి ప్రతిష్టాత్మకమైన ప్రాంతాల్లో ఉగ్రవాదులు ప్రవేశించి కాల్పులు తెరిపితే వాటిని ఎలా ప్రతిఘటించాలో, ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో తెలియపరచడానికి తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ భూమినాదన్, తిరుపతి అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి పర్యవేక్షణలో ఇంటలిజెన్స్ డీఎస్పీ శిరీష, సిఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బహదూర్, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏ ఆర్ డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, ఏ ఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి, రేణిగుంట రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి, ఎస్బి ఎస్సై బాబా, లతో కలిసి దాదాపు 120 మంది సిబ్బంది మాక్ డ్రిల్ లో పాల్గొన్నారు. ఉగ్రవాదులు దాడులు చేసినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రాణాలను ఎలా కాపాడుకోవాలి, గాయపడిన వారికి తక్షణం ఎలాంటి సహాయం అందించాలి తదితర అంశాలపై ప్రయాణికులకు క్షుణ్ణంగా వివరించారు.

## శ్రీహరికోటలో భద్రత మరింత కట్టుదిట్టం

### - విజయవంతంగా మాక్‌డ్రిల్ - సిఐఎస్ఎఫ్ దళాల సంఖ్య పెంపు
### - తిరుపతి పోలీసుల సమన్వయంతో అప్రమత్తం



షార్‌లో సమావేశమైన కమాండెంట్లు, పోలీసు, అధికారులు, మాక్‌డ్రిల్‌పై చర్చిస్తున్న పోలీసులు, భద్రత దళాలు, వందలాది మంది భద్రతా దళ సిబ్బంది

శ్రీహరికోట (తడ), మే 10 ప్రభాతవార్త

దేశ సరిహద్దుల్లో జరుగుతున్న వరుస దాడులు, ప్రతి దాడులతో తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రముఖ ఆలయాలు, ఎయిర్ పోర్టులు, పోర్టులతో పాటు అంతరిక్ష కేంద్రాలపై దాడులు జరుగుతాయన్న అనుమానంతో ముందస్తు చర్యల్లో భాగంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. శనివారం శ్రీహరికోటలో వందలాది మంది భద్రత బలగాలు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నాయి. ఇక్కడ ఉన్న రెండు లాంచ్ ప్యాడ్లు, ఇతర కీలక విభాగాలలో భద్రత ఏ విధంగా ఉండాలన్న దానిపై చర్చించారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో సూళ్లూరుపేట సర్కిల్‌కు చెందిన పోలీసులు, సిఐఎస్ఎఫ్ దళాలతో చేతులు కలిపి షార్ భద్రతకు సైఅన్నారు. సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ, శ్రీహరికోట ఎస్ఐ శ్రీకాంత్, మెరైన్ పోలీసులు, సిఐఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు. అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ వద్ద భద్రత దళాలను ఇప్పటికే పెంచారు. ఇదిలావుంటే షార్‌కి దగ్గరలోని బంగాళాఖాతం తీరంలో నావికాదళ సిబ్బంది భద్రతను వేగవంతం చేశారు. సముద్ర తీరం వద్ద బందోబస్తును కట్టుదిట్టం చేశారు. రోడ్డుమార్గంలో అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తున్నారు. శని, ఆదివారాలలో శ్రీహరికోటలో పనిచేసే ఉద్యోగులకు సెలవులు కావడంతో భద్రత దళ సిబ్బంది షార్ సమీప అడవుల్లో కూంబింగ్ నిర్వహించారు. సిఐఎస్ఎఫ్ పోలీసులకు మాత్రం సెలవులు ఇవ్వకుండా షార్ భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. శ్రీహరికోటకు ఉత్తర దిక్కులోని నవాబుపేట, దక్షిణాన ఉన్న పల్లువార్‌కాడు, నైరుతి దిక్కులోని వేనాడు, పులికాట్ సరస్సు దీవుల్లో అపరిచిత వ్యక్తుల సంచారం గురించి ఆరాతీస్తున్నారు. షార్‌లో ఇప్పటికే మాక్‌డ్రిల్ నిర్వహించి భద్రత పెంచిన సిఐఎస్ఎఫ్ దళాలు అక్కడి డిఐజి సంజయ్‌కుమార్ ఆధ్వర్యాన పనిచేస్తున్నాయి. సీనియర్ కమాండెంట్ సంజీత్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్ ఎస్‌కె గౌర్, ఇతర సిబ్బంది, క్విక్ రెస్పాన్స్ టీమ్, బాంబ్ డిస్పోజల్ టీమ్, అగ్నిమాపక విభాగ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు ఈ నిఘా పర్యవేక్షణలో పాల్గొంటున్నారు.






## కాణిపాకం దేవస్థానంలో క్షుణ్ణంగా తనిఖీలు

### ఆలయ పరిసరాల్లోకి వాహనాల నో ఎంట్రీ : ఆలయ ఈఓ పెంచల కిషోర్



కాణిపాకం, మే 10 ప్రభాతవార్త:

ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అధికారు లు భద్రతను కట్టుదిట్టం చేశారు. కాణిపాకం ఆలయ దర్శనార్థం ప్రతి రోజూ సుమారు 20 నుండి 25 వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. భారత్ పాక్ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆలయ అధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.ఈమేరకు గత నాలుగైదు రోజులుగా ఆలయం వద్ద భద్రతాపరంగా పలు చర్యలు చేపట్టారు. ఆలయ భద్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో వాహన పార్కింగ్ చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు సూచనలు చేశారు. అయితే ఈసూచనలు గత వారం రోజుల వరకు ఎక్కడా అమలు కాలేదు.అయితే గత నాలుగైదు రోజుల నుండి ఆలయ పరిసరాల్లోకి వాహనాలను అనుమతించకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రోటోకాల్ వాహనాలను మినహా మిగిలిన వాహనాలన్నింటిన పాత సంత గేటు వద్ద నుండి వాహన పార్కింగ్ ప్రదేశాలకు పంపుతున్నారు. అలాగే భక్తులకు సంభందించి బ్యాగులను, సెల్‌పోన్‌లు, కెమెరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలయంలోని అనుమతించకుండా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పాయింట్‌ల వద్ద పగడ్బంధీగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు తీసుకువచ్చే బ్యాగులను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం మాత్రమే లోనికి అనుమతిస్తున్నారు. అలాగే ప్రధానాలయం ఎగ్జిట్ గేట్ నుండి భక్తులెవ్వరిని లోనికి అనుమతించకుండా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా స్థానిక పోలీసులు సైతం దేవస్థానం దుకాణాల వద్ద, ఆలయానికి వచ్చే మార్గాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఆలయం వద్ద భద్రతపై ఆలయ ఈఓ పెంచల కిషోర్ మాట్లా డుతూ 'ప్రభాతవార్త' తో మాట్లాడుతూ దేవస్థానం వద్ద ప్రభుత్వ ఆదేశాల మేరకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద బ్యాగుల తనిఖీ కోసం తిరుమల తరహాలో బ్యాగుల తనిఖీల కోసం స్కానర్‌లను త్వరలో అమర్చనున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద చేపట్టే భద్రతా అంశాలకు సంభందించి స్థానికులు,. భక్తులు దేవస్థానంకు సహకరించాలని ఈఓ పెంచల కిషోర్ తెలిపారు.






## నత్తనడకన ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పనులు




### 4వ ఏడాది బ్రహ్మోత్సవాలు లేదాయే!

శ్రీకాళహస్తి, మే 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నడిబొడ్డులో వైష్ణావాలయం. 1989 వరకు టిటిడి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఆలయాన్ని గోపాలకృష్ణారెడ్డి శాసనసభ్యుడుగా గెలిచిన వెంటనే టిటిడి నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలనకిందకు తీసుకొచ్చారు. ఈ ఆలయ పరిపాలనకు ప్రత్యేక పాలకమండలిని నియమించారు. కాగా 2023లో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అప్పటి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పురాతన ఆలయాన్ని పడగొట్టి కొత్త ఆలయం నిర్మాణానికి నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా చక చకా అంచనాలు తయారు చేయించారు.ఉన్న ఆలయాన్ని పడగొట్టించారు. అప్పటితమ అనుచరులకు పనులు అప్పగించారు. నాలుగు కోట్లతో ప్రారంభమైన అంచనాలను టెండర్ స్థాయికి వచ్చే సరికి రూ.7కోట్లకు పెరిగింది. కాంట్రాక్టును ఓ అర్హత లేని అనుచరునికి అప్పగించడంతో పనుల నిర్వహణకు ఎన్నో అవరోధాలు. ఇక్కడి ఆలయనిర్మాణానికి కుప్పం నుంచి కొత్త రాయి దిగుమతికి ఒప్పందం కుదుర్చుకున్నారు.అన్ని వ్యవస్థలను అప్పటి పాలకులే పర్యవేక్షించారు. ఎట్టకేలకు రాయి ఆలయనిర్మాణానికి సంబంధించినదంతా దిగుమతి చేసుకున్నారు. కానీ పనులు చేయించటంలో విఫలమయ్యారని చెప్పవచ్చు. నిధులు,మెటీరియల్ ఉన్నా ఎందుకో విఫలమయ్యారు.

**కూటమి ప్రభుత్వంలో చొరవ:**

సుమారు 11 నెలల ముందు కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ పనులకు సంబంధించి ఓ అస్మదీయ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే ఆయన కూడా పనుల నిర్వహణలో నత్తనడకను మరిపిస్తున్నారు. ఈ కాంట్రాక్టర్ ప్రస్తుతం కూడా టిడిపిలో కీలకంగా ఉన్నారు.కానీ పనుల నిర్వహణలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. వైకాపా హాయాం 3 సంవత్సరాల్లో పునాదుల స్థాయి దాటనినిర్మాణం పదినెలల్లో ఆరులేయర్లు వరకు పూర్తి కావస్తుంది.. అక్టోబర్ లోపల శ్లాబ్‌స్థాయికి పూర్తి చేయగల్గితే వర్షాకాలం లోపల పనులు చేయవచ్చు. కానీ పనులు జరుగుతున్న తీరు గమనిస్తే ఆ స్థాయిలో పరుగులుతీయటం లేదు. ఇప్పటికైనా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చొరవ చూపి పనులను వేగవంతం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.




# సిఎం చంద్రబాబు చేసిన మేలు మరచిపోవద్దు

**- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్**
**- మహిళల సంక్షేమం..అభివృద్ధికి ప్రత్యేక చొరవ !!**

**కుప్పం, మే 10 ప్రభాతవార్త**
కుప్పం నియోజకవర్గానికి 35 ఏళ్లుగా సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న మేలును ప్రతి ఒక్కరూ మరచిపోరాదని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ అధ్వర్యంలో ప్రభుత్వం తరపున మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో రోడ్లు, స్కూళ్లు, కాలేజీలు, ఇంటింటికీ మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకులు, అర్హులకు పక్కా ఇళ్లు ఇవన్నీ సిఎం చంద్రబాబు చేసినవేనన్నారు. కుప్పం అభివృద్ధికి ఆయన నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కుప్పాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గం చేయాలనేది సిఎం తపన అన్నారు. మహిళలు బాగుంటేనే కుటుంబాలు బాగుంటాయని భావించిన సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరమ్మ మహిళలకు



ఉచిత కుట్టుశిక్షణను ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఇప్పిస్తున్నారని అదే స్ఫూర్తితో ప్రభుత్వం కూడా మహిళలకు నియోజకవర్గాల్లో ఉచిత కుట్టుశిక్షణ ఇప్పించి శిక్షణ అనంతరం వారికి ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. మహిళలు కుట్టుశిక్షణ పొందాక తాము కూడా మరికొంతమందికి శిక్షణ ఇస్తే మహిళలు వారి కాళ్లపై వారు నిలబడే అవకాశం ఉంటుందన్నారు. సిఎం చంద్రబాబు మహిళల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, సురేష్, జాకీర్, వేలు, జగన్, కార్పోరేషన్ డైరెక్టర్లు రాజగోపాల్, వేణుగోపాల్, జనసేన కోఆర్డినేటర్ నరేష్, ఎంపిడిఒ విజయదత్, మహిళా నేతలు అనసూయ, వసంతమ్మ, శారదమ్మ, సుగుణమ్మ, తిరుమగళ్, పద్మమ్మ, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదం దేశానికే ప్రమాదం

**-గంగవరం ఎస్సీ సెల్ అధ్యక్షులు రవి**



**గంగవరం, మే 10 ప్రభాతవార్త:**
జమ్మూ పహల్గాంలో యాత్రికుల పై ఉగ్రవాదుల మానవ హోమం హేయమైన చర్యని ఉగ్రవాదం దేశానికే ప్రమాదకరమని గంగవరం ఎస్సీ సెల్ అధ్యక్షులు రవి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం గంగవరం పోలీసు స్టేషన్ సమీపంలోని పలమనేరు మదనపల్లె జాతీయ రహదారిపై ఆయన ఆధ్వర్యంలో యువత పాక్ జండాను రోడ్డుపై తొక్కుతూ భారత్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకుంటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం దేశానికి ప్రమాదకరమని ప్రపంచ దేశాలన్ని కలసి ఐక్యంగా ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని ప్రపంచ శాంతి ప్రగతి కోసం కృషి చేయాలని ఆయన కోరారు. ఎన్నో త్యాగాలు పోరాటాలు చేసి సాధించుకున్న స్వతంత్రం అందరికి దక్కలని, దేశ సార్వభౌమాధికారాని ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని పరిరక్షించు కోవాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ కాల్పుల్లో మృతి చెందిన తెలుగు జవాన్ మురళి నాయక్‌కు ఈ సందర్భంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వినోద్, శివ, మణి, సుధాకర్ రెడ్డి, తులసి, కిరణ్, మంజు, శివలు తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ఉద్యోగులకు ఉచిత హెల్మెట్లు

**తిరుమల, మే 10ప్రభాతవార్తప్రతినిధి:**



నిత్యం తిరుమలలో విధుల నిర్వహణకు తిరుపతి నుండి తిరుమలకు రావడం, తిరిగి తిరుపతికి వెళ్లడం చేస్తున్న ద్విచక్ర వాహనదారులైన ఉద్యోగుల భద్రతకోసం హెల్మెట్లు పంపిణీ చేస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు చెప్పారు. ఉద్యో గులు ఘాట్‌రోడ్లలో ప్రయాణసమయంలో భద్రతకోసం తగిన చర్యలు తీసుకుంటూ, వారికి హెల్మెట్లు అందించామన్నారు. తొలివిడతలో 5లలక్షల రూపాయలు విలువైన 555హెల్మెట్లు గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, ఢిల్లీకి చెందిన కెసిఎన్ హెల్మెట్ల తయారీ సంస్థ అధినేత నవీన్ ముందుకువచ్చారన్నారు. శనివారం ఉదయం తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బిఆర్‌నాయుడు, విజిలెన్స్ సివిఎస్ఓ ఎస్టీవి రామ్‌కుమార్ పంపిణీ చేశారు.

## భక్తిసాగరంలో నగరసంకీర్తన

**గోవిందనామాలతో ప్రతిధ్వనింపు**



**తిరుపతి(రవాణ), మే 10ప్రభాతవార్త:**
శనివారం వేకువజామున ఆధ్యాత్మి కనగరం తిరుపతి గోవిందనామస్మర ణతో ప్రతి ధ్వనించింది. తిరుపతి ప్రజల్లో భక్తిభావం పెంపొందింప జేసేందుకు ప్రతి శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చేస్తోంది. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండడమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ముని నాథరెడ్డి, విక్రమ్‌స్వామి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, మేకల గంగయ్య, సురేంద్రరాజు, పద్మా వతి, జయమ్మ, కళ విగ్రహాలకల్యాణి, మురళీరెడ్డి, వందమందికళాకారులు తిరునామంధరించి తప్పెటతాళాలతో భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## పాత్రికేయుల పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీ ఇవ్వండి

**- జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులకు వినతి**



***చిత్తూరురూరల్, మే 10 ప్రభాతవార్త:*** ప్రైవేట్ పాఠశాలలలో చదువుతున్న పాత్రికేయుల పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీని ఇవ్వాలని చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపియుడబ్ల్యుజె నాయకులు జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు సిఆర్ మహేష్‌రెడ్డిని కోరారు. ప్రతి ఏటా పాత్రికేయుల పిల్లలకు 50శాతం రాయితీని ఇస్తున్నారనీ, అదేవిధంగా రానున్న విద్యాసంవత్సరంలోను రాయితీ కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి కాళేశ్వరరెడ్డి, ఏపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షుడు లోకనాథన్, కార్యనిర్వాహక కార్యదర్శి అశోక్‌కుమార్, సభ్యులు శివకుమార్, పవన్‌కుమార్, చంద్రశేఖర్, శివప్రసాద్, జయకర్, మహేష్, రామక్రిష్ణ, బాలసుందరం, సురేష్, జికె శివ, రాజేష్ పాత్రికేయులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



***కుప్పం, మే 10 ప్రభాతవార్త*** పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కుప్పం తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పిజి సెల్వం, ప్రధాన కార్యదర్శి గణేష్ పిళ్లై కోరారు. శనివారం స్థానిక ఎన్జీఓహోంలో పెన్షనర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పహల్గామ్ దాడిలో మృతి చెందిన భారత పౌరులు, దేశం కోసం ప్రాణాలు అర్పి ంచిన జవాన్ మురళీనాయక్, పెన్షనర్ రజియాబేగం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం పిఆర్‌సి కమీషన్ వేయడంతో పాటు ఐఆర్ ప్రకటించాలని, డిఆర్‌ను సైతం విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశు, శంకరయ్య, ఇంద్రప్రకాష్, మునెప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో కెడిసి విద్యార్థుల ప్రతిభ

**కుప్పం, మే 10 ప్రభాతవార్త**



తిరుపతి ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధించినట్లు కాలేజ్ ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్ తెలిపారు. బిఎస్సీ (ఎంపిసిఎస్)లో భవాని 9.20పాయింట్లు, అర్చన 9.2, బిబిఎలో వర్ష 9.02, ప్రతీక్ష 9.0, బికాం (సిఎ)లో నిత్యలక్ష్మి 8.91, దివ్యశ్రీ 8.85, బిఎస్సీ (ఎంఎస్‌సిఎస్)లో భువనేశ్వరి 8.91, గుణవతి 8.47, బిజెడ్‌సిలో విఘ్నేష్ 8.92, ప్రవళిక 8.63పాయింట్లతో కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. అలాగే ఫిజిక్స్‌లో 8మంది 10కి పది పాయింట్లు, సిసిటిలో ముగ్గురు, గణితంలో ఇద్దరు పదికి పది పాయింట్లు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెదేపా నేత కన్నన్‌చే మహిళకు ఆర్థికసాయం



**కుప్పం, మే 10 ప్రభాతవార్త** కుప్పం పట్టణం కొత్తపేట పద్నాలుగో వార్డుకు చెందిన శశమ్మ అనే మహిళకు వయోభారం కారణంగా వేలిముద్రలు, కంటిపొరలు ఆధార్ అప్‌డేట్‌కు సరిపోకపోవడంతో ఆధార్ ప్రధాన కార్యాలయంకు సంప్రదించాలని సంబంధిత అధికారులు సూచించారు. అయితే హైదరాబాద్‌కు వెళ్లే ఆర్థిక స్థోమత శశమ్మకు లేదు. దీంతో కుప్పం తెదేపా విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ స్పందించి శశమ్మ హైదరాబాదుకు వెళ్లి వచ్చేందుకు ఖర్చుల నిమిత్తం తనవంతుగా ఆర్థికసాయం అందించారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 18మంది ఎంపిక

**కుప్పంరూరల్, మే 10 ప్రభాతవార్త**



కుప్పం లయన్స్ క్లబ్, పిఇఎస్ అర్బన్ ఆస్పత్రి అధ్వర్యంలో శనివారం కుప్పంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. సుమారు వందమంది శిబిరంకు హాజరు కాగా వైద్యులు కంటి పరీక్షలు జరిపి వారిలో 18మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శిబిరంకు వచ్చిన ప్రజలకు సోమశేఖరశాస్త్రి కుటుంబీకులు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, సభ్యులు సెల్వం, శివదేవర్, కృష్ణమూర్తి, శివప్రసాద్, అనిల్, ధనశేఖర్, విజయ్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం**

## మిద్దింటి కిషోర్‌కు గౌరవ డాక్టరేట్

**-సామాజిక సేవకు దక్కిన గౌరవం**



***చౌడేపల్లి, మే 10 ప్రభాతవార్త*** సామాజిక సేవా రంగంలో తనదైన ముద్ర వేసుకొన్న మిద్దింటి కిషోర్ అపూర్వ గౌరవ డాక్టరేట్‌ను దక్కించుకున్నారు. భారత్ వర్చువల్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ బెంగళూరు వారు మిద్దింటి ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసారు. ఈమేరకు బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు ఆయనను సత్కరించారు. చౌడేపల్లి పరిధిలోని పొదలపల్లి గ్రామానికి చెందిన మిద్దింటి కిషోర్ విద్యార్థి దశ నుంచి సామాజిక సేవకుడుగా గుర్తింపు పొందారు. ఆయన తండ్రి మిద్దింటి శంకరనారాయణ ప్రముఖ శక్తిక్షేత్రం బోయకొండ దేవస్థానం ఛైర్మన్‌గా పని చేసారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో స్థానిక ప్రజలను ఆదుకొన్న చరిత్ర కిషోర్ కుటుంబానికి వుంది. మిద్దింటి దక్కిన అరుదైన గౌరవం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, వ్యాపార వేత్తలు అభినందించారు.

## అశ్వవాహనంపై దేవదేవుడు

**చౌడేపల్లి, మే 10 ప్రభాతవార్త**



స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రసన్న పార్వతీ సమేత మృత్యుంజయేశ్వరుడు గుర్రపు వాహనంపై ఊరేగాడు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితులు, వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఉత్సవ విగ్రహాలను అశ్వంపై వుంచి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అన్నం కులస్థులు వాహనానికి ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## మురళీ నాయక్ కు ఘన నివాళి

**పుంగనూరు రూరల్, మే 10, ప్రభాతవార్త**



అమరవీరుడు మురళీ నాయక్‌కు అంబేద్కర్ సర్కిల్లో శనివారం ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆయన అందరికీ ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. మురళీ నాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. మాల మహానాడు కార్యదర్శి అశోక్, బీజేపీ నాయకుడు అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

## సైనికులకు మద్దతుగా నిలుద్దాం

**పుంగనూరు, మే 10, ప్రభాతవార్త**



దేశ ప్రజలంతాజవాన్లకు మద్దతుగా నిలబడాలని రాష్ట్ర బీజేపీ మైనారిటీ నాయకులు అయూబ్ ఖాన్ పిలుపునిచ్చారు. పాక్ ఆపరేషన్‌కు బన్యన్ ఉల్ మర్సూస్ అని పేరు పెట్టడాన్ని ఖండించారు. పాకిస్థానీయులు బెంగాలీ ముస్లింలను పందులన్నారు, ఇండియన్ ముస్లింలపై దాడి చేస్తున్నారు, ఇస్లాం పేరుతో చిన్నారులను హతమారుస్తున్నారు. వారికి అసలు ఇస్లాం పేరు పలికే అర్హత కూడా లేదు. పాక్ వెనక్కి తగ్గకపోతే భారత్ కూడా వెనక్కి తగ్గేదిలేదు అని స్పష్టం చేశారు.

## ఇండియన్ ఆర్మీ ధైర్య సాహసాలకు సెల్యూట్

**- కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్ఛార్జి ముట్టుకూరు జగపతి**

**పూతలపట్టు, మే 10, ప్రభాతవార్త**



దేశంలో అశాంతి మరణ హోమం సృష్టిస్తూ పాకిస్తాన్ అండతో దేశ సరిహద్దులకు అవతల దక్కున్న ఉగ్రవాదులపై భారత ఆర్మీ దాడులు చేసి హతమార్చడం ఆర్మీ ధైర్యసహసాలకు సెల్యూట్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్ఛార్జి ముట్టుకూరు జగపతి అన్నారు. జమ్మూ టార్గెట్గా పాకిస్తాన్ డ్రోన్ దాడులు జమ్మూ ఎయిర్ స్పేస్ పై పాక్ మెసేజ్ ఎటాక్. 8 పాక్ మెసేజ్ ను కూల్చివేసిన భారత్ ఎస్ 400 సిస్టంతో భారత సైన్యం ధ్వంసం చేసారు. జమ్మూ , కాశ్మీర్, రాజస్థాన్ బ్లాక్ అవుట్ చేసిన బలగాలు, ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని సైన్యం హెచ్చరికలు చేసారు. పలుచోట్ల పాక్ డ్రోన్లను భారత సైన్యం కూల్చివేస్తున్నారు. జమ్ములో ఏడు చోట్ల పేలుళ్ల శబ్దాలు, జమ్మూ, కాశ్మీర్ మోగిన సైరన్లు, పఠాన్ కోర్ట్ ఎయిర్ స్పేస్ ను టార్గెట్ చేసిన పాక్, సరిహద్దు ప్రాంతాలలో కొనసాగుతున్న ఎదురు కాల్పులు, యాంటీ మెసేజ్ సిస్టంకి దొరక్కుండా డ్రోన్‌లను పాకిస్తాన్ ఉపయోగించారు. నయాంటీ డ్రోన్ సిస్టంతో పాక్ డ్రోన్లు భారత సైన్యం కూల్చి వేసారు. పంజాబ్ అమృత్సర్లో విద్యుత్ సరఫరా నిలిపివేసారన్నారు. జమ్మూ ఏర్పోర్ట్ నుండి బయలుదేరిన ఫైటర్ జెట్స్, పాక్ ఎఫ్ 16 ఫైటర్ జెట్‌ను కూల్చివేసిన భారత సైన్యం, పాక్ సైన్యానికి దీటుగా భారత సైన్యం జవాబు ఇస్తున్నారన్నారు. హెచ్ఐ 8 పాక్ మిస్సైల్స్‌ను భారత్ కూల్చివేసారని, పాక్‌కు చెందిన మూడు ఫైటర్ జెట్లను కూల్చివేసిన చివరిదాకా వెళ్లేందుకు సిద్ధమంటున్న భరత్ దేశం వైపు చూడాలంటే భయపడేలా చేస్తామంటూ హెచ్చరించారు.

## గుణాత్మక విద్య బోధనే లక్ష్యంగా సంసిధ్ క్యాంఫర్డ్ స్కూల్

**చిత్తూరురూరల్, మే 10 ప్రభాతవార్త:**



విద్యార్థులకు గుణాత్మక విద్యబోధనే లక్ష్యంగా చిత్తూరులోని సంసిధ్ క్యాంఫర్డ్ స్కూల్, టాటా గ్రూపుకు చెందిన క్లాస్‌ఎడ్జ్ భాగస్వామ్యంతో విద్యాబోధనకు శ్రీకారం చుట్టినట్లు సంసిధ్ క్యాంఫర్డ్ స్కూల్ నిర్వాహకులు వాస శ్రీనివాసరావు, సిఆర్ మహేష్‌రెడ్డి తెలిపారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తమ పాఠశాలలలో వినూత్నంగా ప్రవేశపెడుతున్న విద్యా కార్యక్రమాల వివరాలను వివరించారు. ముందుగా టాటా క్లాస్‌ఎడ్జ్, సంసిధ్ స్కూల్ విద్యాబోధన పోస్టర్లను ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి కాళేశ్వరరెడ్డిలతో కలసి ఆవిష్కరించారు. సంసిధ్ స్కూల్, టాటా గ్రూప్‌తో అనుసంధానమై వినూత్నంగా విద్యారంగాన్ని అభివృద్ధిపరిచేలా బోధనను చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో విలువలు, నైపుణ్యాలు, నాయకత్వలక్షణాలు కలిగిన భవిష్యత్తు నాయకులను రూపొందించడమే విద్యాబోధన ముఖ్యఉద్దేశమని పేర్కొన్నారు. సాంకేతిక ఆధారిత తరగతులు, నాయకత్వ వికాసం, విలువల పెంపకం, విద్యా నెట్‌వర్క్స్ విస్తరణ, భవిష్యత్ నైపుణ్యాభివృద్ధి తాము అనుసరించే విద్యావిధానమని తెలిపారు. ఎప్పటికప్పుడు విద్య అనుభవాలను మారుస్తూ ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచే దిశగా తమ పాఠ్యప్రణాళిక వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు వెస్ట్, నార్త్, ఈస్ట్ సంసిధ్ క్యాంఫర్డ్ క్యాంపస్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మకు టీడీపీ నాయకుల ఘన నివాళి

**సత్యవేడు, మే 10 ప్రభాతవార్త:**



సత్యవేడు తెలుగుదేశం పార్టీ విజయపరంపరలో కీలక భూమిక పోషించినట్టు వంటి దివంగత నేత నటరాజపిళ్లె సతీమణి, సీనియర్ నాయకులు బాషా, తిరునీలకంఠల మాతృమూర్తి ఎల్లమ్మ(70) మృతదేహానికి టీడీపీ నాయకులు, సత్యవేడు పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు, కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను కలసి ప్రగాఢ సంతాపం తెలిపారు. సత్యవేడు గ్రామానికి పెద్ద దిక్కుగా ఉన్నటువంటి కుటుంబంలో ఊహించని విషాదం నెలకొనడం చాలా బాధాకరమన్నారు. చంద్రశేఖర్‌నాయుడు, శ్రీపతిబాబుల వెంట మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మల్లినాయుడు, కృష్ణతేజ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతులకుటుంబాలకు తెదేపా ప్రమాదబీమా

**శ్రీకాళహస్తి, మే 10 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉడమలపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు మునిప్రసాద్ దాసరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వీరి కుటుంబానికి తెలుగుదేశంపార్టీ తరపున ప్రమాదబీమా రూ.5లక్షలు అందించిన తెలుగు దేశంపార్టీ తరపున ప్రమాదబీమా రూ.5లక్షలు అందించిన తెలుగుదేశంపార్టీ మాజీ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు, ఉడమలపాడు నాయకులు బలరామయ్య, కృష్ణయాదవ్, మహీంద్రా, సతీష్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాగా ఏర్పేడు మండలం రాజులపాళెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త మధు ప్రమాదవశాత్తు మరణించడంతో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో ప్రమాదబీమా రూ.5లక్షలు వారి కుటుంబానికి చెందిన మల్లీశ్వరమ్మకు వారి స్వగృహం వద్ద అందుకు సంబంధించిన పత్రాలు రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు క్లస్టర్ ఇన్‌ఛార్జి రెడ్డివారి గురవారెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు నైనారు పొన్నారావు మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్‌నాయుడు, గ్రామ నాయకులు గుర్రప్పనాయుడు, జగదీష్‌నాయుడు, మురుగయ్య, శేషమనాయుడు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## తన మామిడి తోట షెడ్డులో మద్యం సీసా బాటిల్ పోగు చేశారు

**- టీడీపీనాయకుడు మునికృష్ణ**

**విజయపురం, మే 10 ప్రభాతవార్త:**



మా పొలంలోని మామిడి తోట షెడ్డులో కొత్త ఖాళ్ళ మద్యం సీసా బాటిళ్ళను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దాచి పెట్టారని మండలంలోని జగన్నా థపురానికి చెందిన టీడీపీ నాయకుడు మునికృష్ణ ఫిర్యాదు చేశారు. శనివారం మండలంలోని వ న్నా ర ం - వి ళా న పా ళె ం మార్గమాద్యంలో మామిడితోట వద్ద ఉన్న షెడ్డులో పదికిపైగా మూటలు కనిపించడంతో అనుమానం వచ్చి పరిశీలించగా కొత్త ఖాళీ మద్యం సీసాగా గుర్తించామన్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఖాళీ మద్యం బాటిళ్ళను ఎందుకు దాచి ఉంచారో తెలియడం లేదని, నకిలీ మద్యం తయారీ కోసం దాచి పెట్టారా తెలియడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం సరఫరా జరుగుతుందని పలు ఆరోపణలు ఉన్నాయని, ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## చెక్‌బౌన్స్‌కేసులో

# రూ.90లక్షలు పరిహారం చెల్లించాలని కోర్టుతీర్పు

**తిరుపతి(రవాణ), మే 10 ప్రభాతవార్త**
చెక్‌బౌన్సు కేసులో బాధితుడికి న్యాయం చేస్తూ తిరుపతినాల్గో అదనపు మున్సిప్ కోర్టు తీర్పునిచ్చింది. తిరుపతి ఖాదీకాలనీకి చెందిన వివి గ్రూప్ పార్టనర్ వంకిరెడ్డి వినోద్‌చైతన్య తనకు జరిగిన అన్యాయంపై కోర్టులో కేసు దాఖలు చేశాడు. ఈ కేసును విచారణ చేపట్టిన తిరుపతిలోని నాల్గవ అదనపు న్యాయమూర్తి బాధితుడికి న్యాయం చేయాలని, అంతేగాక నిందితుడు బెంగుళూరుకు చెందిన శ్రీకృష్ణషెల్టర్స్ ప్రైవేటు కంపెనీ ఎండి కెండెల్ అశ్వత్ రాఘవేంద్ర 90లక్షలు రూపాయలు పరిహారం నెలరోజుల్లోపు చెల్లించాలని, ఏడాది జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

## నగరపాలక సంస్థచే భక్తులకు త్రాగునీరు, మజ్జిగ పంపిణీ

**- మజ్జిగ పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య**

**తిరుపతి కార్పొరేషన్, మే 10, ప్రభాతవార్త**



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు విచ్చేసే భక్తుల కొరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్రాగునీటి సరఫరా కేంద్రాలలో శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయంలో భక్తుల కొరకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు విచ్చేసే భక్తులకు త్రాగునీరు, మజ్జిగ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నామని అన్నారు. గంగమ్మ తల్లి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. జాతర, విశ్వరూప దర్శనం రోజు భక్తులు ఎక్కువ సంఖ్యలో రానుండడంతో గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మంగళవారం జాతర రోజు, విశ్వరూప దర్శనం రోజు ఎవరెవరు ఎక్కడ ఉండాలి, ఎంతమంది స్టేజ్ పైన ఉండాలి, తదితర విషయాలపై ఉత్సవ కమిటీ, ఆలయ అధికారులు, పోలీసు అధికారులతో చర్చించామని అన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ప్రథమ చికిత్సా కేంద్రం కూడా ఏర్పాటు చేశామని అన్నారు. భక్తులు అమ్మవారిని సంతోషంగా దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని, ఎక్కడా తొందర పడకుండా ఓపిగ్గా అందరూ దర్శనం చేసుకోవాలని భక్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, డీఎస్పీ భక్తవత్సలం, సూపరింటెండెంట్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, ఆర్. ఓ. సేతుమాధవ్, ఆలయ ఈవో జయకుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ మహాపాత్ర, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

## ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీ సదాశివ వార్షిక బ్రహ్మోత్సవాలు



**పుత్తూరు రూరల్, మే 10 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణంతో ముగిసింది. ఉదయం ఆలయంలో తీర్థ వారి ఉత్సవం, మూలవర్లకు కలశసాభిషేకం ఆలయ ఆవరణలోని పరివార దేవతలకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే శని త్రయోదశి సందర్భంగా శని భగవానుడికి తైలాభిషేకం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. సాయంత్రం 6 గంటలకు పైన ధ్వజావరోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే నంది ప్రదోషం కార్యక్రమం అనంతరం రాత్రి 8 గంటలకు పైన ఏకాంత సేవ కార్యక్రమం భక్తులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

## మరాలిగేటుకు సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయండి



**పుత్తూరు రూరల్, మే 10 ప్రభాతవార్త:** పుత్తూరు మున్సిపల్ పరిధిలోని మరాలిగేటు గ్రామ ప్రజలకు సిమెంటు రోడ్డు ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సుమారు 20 కుటుంబాల జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కొలుస్తున్న చిన్నపాటి వర్షాలకు రోడ్లు గుంతలమయంగా తయారైంది. ద్విచక్రవాహన దారులు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. స్పందించి సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రకృతిలో తల్లిప్రేమ చాలా గొప్పది

పుత్తూరు రూరల్, మే 10 ప్రభాతవార్త:



ప్రతి సంవత్సరం మే నెలలో రెండో ఆదివారం రోజున మాతృ దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. అంగన్‌వాడీకేంద్రాల్లో ఈ సంవత్సరం తల్లికి వందనం పేరుతో మాతృ దినోత్సవాన్ని శనివారం పుత్తూరు మండలంలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కామరాజు నగర్, రజక కాలనీ, గేటు పుత్తూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లికి వందనం కార్యక్రమంలో సీడీపీవో ప్రమీల పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతిలో తల్లి ప్రేమకు సాటి ఏదీ లేదని పిల్లల జీవితంలోని ప్రతి అడుగులో తల్లి త్యాగం తల్లి ప్రేమ కనబడుతుందని అలాంటి తల్లిని పిల్లలు గౌరవించాలని చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులను గౌరవించే విధంగా ఈ కార్యక్రమాలు సహకరిస్తుందని తెలియజేశారు. అనంతరం కొంత మంది తల్లులకు తమ బిడ్డలు పోషకార లోపంతో బాధపడుతూ ఉండడం అంగన్‌వాడీ కేంద్రంలో గుర్తించి వారికి మంచి పోషకాహారం అందించాలని తెలియజేస్తే వారిని వారికి మంచి పోషకాహారం అందించి జాగ్రత్తగా ఆ పిల్లలను తల్లి సంరక్షించి పోషకాహార లోపం ఆ బిడ్డల్లో లేకుండా తల్లి చేసిన కృషికి సన్మానం చేయడం జరిగింది. అనంతరం ప్రతితల్లి బిడ్డలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రీ స్కూలుపిల్లలు వారి తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గీతాంజలి శ్రీపాల్గొన్నారు.

## మాదనపాళెం చెరువుపై అక్రమ కట్టడ్డాలు



రాత్రికి రాత్రి చెరువును ఆక్రమించి ఇళ్ళ నిర్మాణం

నిద్రవస్థలో ప్రభుత్వ యంత్రాంగం

**సత్యవేడు, మే 10 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం మాదనపాళెం చెరువు ఆక్రమణలతో ఊరవుతోంది. స్థానికులు కొందరు చెరువుపై కన్నేసి ఏకంగా రాత్రికి రాత్రి అక్రమ నిర్మాణాలతో దర్జాగా ఇళ్ల నిర్మించుకుంటున్నారు. మాదనపాళెం సర్వే నెం.839లో 11 ఎకరాల విస్తీర్ణంలో ఇరిగేషన్ చెరువు ఉంది. అయితే చెరువు పారుదల కావాల్సిన భూములు శ్రీసిటీ సెజ్‌కు భూసేకరణ ద్వారా కేటాయించారు. దీన్ని అలుసుగా తీసుకున్న స్థానిక ఆక్రమణ దారులు కొందరు ఏకంగా రోడ్డుకు ఆనుకుని ఉన్న చెరువు భూమిని ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో భూములకు భారీ విలువ పెరగడంతో ఏకంగా ఆక్రమణ దారులు చెరువు భూమిపై కన్నేశారు. రోజు రోజుకు ఆక్రమణ దారుల ఆగడాలు చెరువు భూమిలో ఎక్కువవుతున్నాయి. అయితే ఆక్రమణలను అడ్డుకోవాల్సిన ఇరిగేషన్ శాఖ, రెవెన్యూశాఖలు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానిక గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రం కళ్ల తెరిచి ఆక్రమణలపై కొరడా జులిపించాలని కోరుతున్నారు. అంతేకాక పంచాయతీకి చెందిన బోరు నుంచి గ్రామస్తులకు నీటి సరఫరా చేసేందుకఉ ట్యాంకుకు వెళ్లే ప్రధాన పైపులైన్ నుంచి ఏకంగా ఆక్రమణ దారులు ఇళ్ళకఉ నీటి సరఫరాకోసం అనధికారికంగా పైపులైన్లు వేసుకోవడంతో గ్రామస్తులకు నీటి సరఫరా కూడా ఆగిపోతుందని స్థానిక గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ఎస్టీవీడీ2: చెరువును ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుంటున్న దృశ్యం

## ఇంజనీరింగ్ విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన

తిరుపతిరూరల్, మే10 ప్రభాతవార్త:



విద్యార్థులు దురఅలవాట్లకు దూరంగా ఉండాలని, పొగాకు, గంజాయి, హెరాయిన్ తదితర మత్తుపదార్థాలను తీసుకుని జీవితాలను చిత్తు చేసుకోవద్దని తిరుపతిరూరల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరసానాయుడు సూచించారు. శనివారం తిరుపతిరూరల్ సి.గొల్లపల్లిలో ఉన్న సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఎక్సైజ్ అధికారులు డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియజేసారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని, లక్ష్యాన్ని చేరుకునే వరకు నిర్విరామంగా కృషి చేయాలన్నారు. తాత్కాలిక ఆనందాలకు స్వస్తి పలకాలని, మీ తల్లిదండ్రులు మీపై ఎంతో నమ్మకాన్ని కలిగి ఉంటారని, వారికి నమ్మకాన్ని ఒమ్ముచెయొద్దన్నారు.

## దేశ రక్షణ దళానికి సైనికులను అందించేలా కృషి చేస్తాం




– చైర్మన్ డాక్టర్ బి. శేషారెడ్డి

**తిరుపతి హెల్త్, మే 10 ప్రభాతవార్త :** భారతదేశ రక్షణ దళానికి ఎంతో మంది సైనికులను అందించేలా కృషి చేస్తా మని ప్రస్తుతం ఉన్నతాధికారులుగా విద్యార్థులు ఎదగడానికి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి. శేషారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నేళ్ళుగా అందరి సహకారంతో దేశ రక్షణ దళానికి ఎంతో మంది సైనికులను అందించామని,వారు ఉన్నతాధికారులుగా ఎదగడానికి శారీరక, మానసిక, మానవీయ విలువతో కూడిన విద్యను కూడా అందిస్తున్నామన్నారు. దేశ, రాష్ట్రాలలో జరిగే అన్ని పోటీల్లో, కేంద్ర, రాష్ట్ర పోలీస్. సైనిక్ పోటీల్లో వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని ఆ పోటీల్లో ప్రతిభ చూపిస్తున్నారన్నారు. వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులు 17 ఏళ్ళకే ఉద్యోగులు పొందే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ సందర్భంగా కేంద్ర డిఫెన్స్ నుంచి వెరిటాస్ సైనిక్ స్కూల్ గుర్తింపు పొందిన పత్రాన్ని మీడియాకు చూపించారు. సంస్థ డైరెక్టర్లు బి. శ్రీకర్‌రెడ్డి, బి. సందీప్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబరు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

## భారత్ సత్తా ప్రపంచానికి తెలిసింది....

రేణిగుంట, మే 10 ప్రభాతవార్త

భారతదేశం సత్తా ప్రపంచానికి సింధూర్ ఆపరేషన్ ద్వారా తెలిసిందని బిజెపి యువనేత, ఓ బి సి యువసేన రాష్ట్ర అధ్యక్షులు వెంకటాద్రి యాదవ్ అన్నారు. భారతదేశం లాంటి కర్మభూమి, ధర్మభూమి, దేవభూమి, ప్రపంచంలో ఎక్కడ లేదన్నారు. శ్రీకృష్ణుడు గీతలో చెప్పిన విధంగా అధర్మం పెచ్చుమీరినప్పుడు ప్రతి యుగంలో తాను జన్మిస్తానని చెప్పినట్లు ప్రస్తుతం పాకిస్తాన్ పొగరు అణచడానికి భారత ప్రధాని మోడీ పుట్టారని అన్నారు. భారత చర్య పట్ల ప్రపంచ దేశాలన్నీ అభినందిస్తున్నాయన్నారు. భారతదేశానికి 140 కోట్ల మంది ప్రజల మద్దతు ఉందన్నారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకిలించినప్పుడే ప్రపంచ శాంతి ఏర్పడుతుందని అన్నారు.

## నాన్ ఎన్ యు ఈ టీ అడ్మిషన్లకు ధరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి విద్య, మే 10 ప్రభాతవార్త

జాతీయ సంస్కృత వర్సిటీలో నాన్ ఎన్ యు ఈ టీ (నేషనల్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్) శాస్త్రీ (డిగ్రీ),ఆచార్య (పీజీ) కోర్సులలో ప్రవేశాలకు ఆన్లైన్ ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకడమిక్ ఎఫైర్స్ డీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆచార్య కోర్సులో సుమారు 6 విభాగలలోనూ,శాస్త్రీ కోర్సులలో బీఏ,బీఎస్సీ కోర్సులలో జాతీయ స్థాయి ఎంట్రన్స్ పరీక్ష ద్వారా కాకుండా డైరెక్టర్గా ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 8నుంచి ధరఖాస్తులు ప్రారంభమయ్యాయని, వచ్చేనెల 6వతేదీలోపు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## తాటిచెట్టుపై నుండి కిందపడి యువకుడు మృతి



**చంద్రగిరి, మే 10 ప్రభాతవార్త:** తాటి చెట్టుపై నుండి క్రిందపడి మోహన్ సాయి (24) మృతి చెందిన దుర్ఘటన శనివారం చంద్రగిరిలో చోటుచేసుకున్నది. గ్రామస్థుల కధనం మేరకు వివరాలిలావున్నాయి. చంద్రగిరి కోట గ్రామానికి చెందిన సిద్దయ్య కుమారుడు మోహన్ సాయి తాటికాయలు కోసేందుకు నిచ్చెన వేసుకుని చెట్టు ఎక్కాడు. తాటికాయలు కోసే క్రమంలో తాటిమట్టలను తొలగిస్తుండగా అదుపుతప్పి క్రింద పడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన మోహన్ సాయిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమం కావడంతో 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. అయితే మోహన్ సాయి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. దీంతో కోట గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి.

## భక్తులకు కల్యాణ వెంకన్న ఆశీస్సులు



**చంద్రగిరి, మే 10 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

## భారత వికాస్ పరిషత్ తిరుపతి అధ్యక్షుడుగా డాక్టర్ నిరంజన్ బాబు

కార్యదర్శిగా అవిలాల శ్రీదర్ పిళ్ళై, కోశాధికారిగా సుంకు వేణుగోపాల్



**రామచంద్రాపురం, మే 10 ప్రభాతవార్త:** భారత వికాస్ పరిషత్ తిరుపతి ప్రాంత అధ్యక్షుడుగా సెవెన్ హిల్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాల దక్షిణ క్షేత్ర కార్యదర్శి ధూళిపాల పురుషోత్తం శాస్త్రి ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. భారత వికాస్ పరిషత్ తిరుపతి కార్యదర్శిగా అవిలాల శ్రీదర్ పిళ్ళై, కోశాధికారిగా సుంకు వేణుగోపాల్, ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ క్రమంలోనే తిరుపతి సెవెన్‌హిల్స్ నూతన శాఖను ఏర్పాటు చేశారు. సెవెన్‌హిల్స్ శాఖ అధ్యక్షుడుగా డాక్టర్ ప్రభాకరన్, కార్యదర్శిగా పేట డాక్టర్ సుబ్రమణ్యం, కోశాధికారిగా పృధ్వీరాజ్‌ను నియమించారు. అనంతరం భారతదేశ వికాసానికి నిస్వార్ధంగా కృషి చేస్తానని భారత వికాస్ పరిషత్ నియమావళిలోని సంపర్క్, సహయోగ్, సంస్కార్, సేవ, సమర్పన్ ఈ 5 సిద్ధాంతాలను పాటిస్తామని ప్రమాణం చేశారు.

## తాతయ్యగుంట గంగమ్మకు మాతాజీ రమ్యానంద భారతి సారె

రామచంద్రాపురం, మే 10 ప్రభాతవార్త:



తిరుపతిలోని తాతయ్య గుంట గంగమ్మ వారి జాతర ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి సారెను సమర్పించారు. రాయలచెరువు మాజీ సర్పంచ్ మాదవితో కలసి శ్రీశక్తి పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారికి వజ్రాలు పొదిగిన జాతి కెంపు, బంగారు తిలకంను ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి పరిసర ప్రాంతాలను పాలించే పాలేగాళ్ళ దుశ్చర్యల నుండి ఆడపడుచులను కాపాడిన తల్లి గంగమ్మ అన్నారు. ప్రధాన అర్చకుల నివాస భవనం ఆధునీకరణకు, దేవాలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## ఘనంగా మహా గణపతి విగ్రహ ప్రతిష్టాపన

పాకాల, మే 10, ప్రభాతవార్త

పాకాల మండలం, వలపలవారిపల్లి గ్రామంలో మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహా కుంభాభిషేకానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గ్రామస్థులు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పులివర్తి నాని స్వామివారికి శనివారం పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలు, కార్యకర్తలు, గ్రామస్తులు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు పులివర్తి నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కైలాసకోనలో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయండి

: జిల్లా ఎస్పీకి ఎమ్మెల్యే ఆదిమూలం వినతి



**నారాయణవనం, మే 10 ప్రభాతవార్త :** మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా దిన దినాభివృద్ధి చెందుతున్న కైలాసకోనలో పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం సాయంత్రం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైలాసకోనలో ఏడాది పొడుగునా జలపాతంలో నీరు ప్రవహించడం వల్ల జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు రాష్ట్రం నుంచి ప్రతి రోజు పర్యాటకులు, భక్తులు, యువతి, యువకులు వస్తుంటారని గుర్తు చేశారు. ఇక్కడ యువత మద్యం సేవించడం వల్ల అప్పుడప్పుడు గొడవలు జరుగుతుంటుందని, కావున మహిళలకు రక్షణ కల్పించడ కోసం తప్పక పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. ఎమ్మెల్యే వినతిపై ఎస్పీ సానుకూలంగా స్పందించడం జరిగింది.

## అంతర్రాష్ట్ర ఆవుల దొంగల అరెస్ట్.



**రేణిగుంట, మే 10 ప్రభాతవార్త** రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీసులు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పి రవి మనోహర్ ఆచారి పర్యవేక్షణలో రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు నేతృత్వంలో రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి, గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ రెడ్డి శనివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించి 9 మంది ఆవుల దొంగలను అదుపులోకి తీసుకొని నాలుగు ఆవులకు విముక్తి కల్పించడంతోపాటు ఒక బలోరా వ్యాను, మరో ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గాజులమండ్యం పోలీసులు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ బోలోరా వాహనం వేగంగా రావడాన్నీ పోలీసులు గుర్తించారు. వాహనాన్ని ఆపి పోలీసులు తనిఖీ చేయగా అందులో అక్రమంగా ఆవులను రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో హర్యానాకు చెందిన మొహమ్మద్ రఫీ, జీకంఖాన్, మహమ్మద్ ఇమ్రాన్, ఇజ్రాయిల్, తాహిర్, రఫిక్ అహ్మద్, జుబేర్, హనీ హనీస్, తమిళనాడుకు ఉత్తుకోటకు చెందిన కబురు భాష ఆవులు రవాణా చేస్తున్నట్టు నిర్ధారించారు. కబురు భాష గ్యాంగును ఏర్పాటు చేసుకొని గత ఆరు నెలలుగా రేణిగుంట, వడమాల పేట, గూడూరు ప్రాంతాలలో ఆవులను దొంగలించి వాటిని కసాయి వాళ్లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులో తీసుకొని నాలుగు ఆవులకు విముక్తి కలిగించి రవాణాకు ఉపయోగించిన బొలెరో వ్యాన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదుపులో తీసుకున్న నిందితులను రిమాండ్ కు తరలించారు. అంతర్రాష్ట్ర ఆవులు దొంగలను పట్టుకున్న రేణిగుంట రూరల్ పోలీసులను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారు.

## మహిళ అదృశ్యం-కేసు నమోదు



తొట్టంబేడు, మే 10 ప్రభాతవార్త

మండలంలోని పెద్దసింగమాల గ్రామానికి చెందిన శ్యామలాదేవి(69) రెండు రోజుల నుంచి కనిపించడం లేదని మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు టుటౌన్ సిఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఈమె గురించి ఏదైనా సమాచారం తెలిస్తే చుట్టుప్కల గ్రామాల ప్రజలు, పట్టణవాసులు వెంటనే టుటౌన్ సిఐకి తెలియజేయాలని లేకపోతే 9440900008 నంబర్‌కు పోన్ చేయాలని కోరారు.

## డిగ్రీ పరీక్షా ఫలితాలు విడుదల

**తిరుపతి విద్య, మే 10 ప్రభాతవార్త** ఎస్వీయూ పరిధిలో గత ఏడాది డిసెంబర్ లో నిర్వహించిన డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్సైట్ ను పరిశీలించాలని సూచించారు.

## ఉగ్రదాడుల్లకు దీటుగా భారత్ సైన్యం



**శ్రీకాళహస్తి, మే 10 ప్రభాతవార్త** ఏప్రిల్ 22న జరిగిన పాకిస్తాన్ ఉగ్రవాదులు చేసిన దాడిలో అమాయకులైన 26మంది భారతీయ హిందువులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదుల అకృత్యాలకు దీటుగా మన భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ మే 7వ తేదీన చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' ద్వారా 100మంది ఉగ్రవాదులను హతమార్చడం అంతేకాకుండా జరుగుతున్న యుద్ధం విజయవంతం కావాలని భారతీయ సైనికులు దేశ సరిహద్దు గ్రామాల ప్రజలు మరియు భారతదేశం మొత్తం క్షేమంగా ఉండాలని కోరుకుంటూ పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న వినాయక ఆలయంలో పూజలు జరిపించారు. కార్యక్రమంలో బిజెపి తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, రాష్ట్ర సభ్యురాలు కండ్రిగ ఉమ, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమాసింగ్, స్థానిక

# తిరుపతి డివిజన్

## 50శాతం సబ్సిడీలతో పశువుల దాణ

శ్రీకాళహస్తిరూరల్, మే 10 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలోని రైతులకు పశువుల దాణ సబ్సిడీలపై అందించుటకు చర్యలు తీసుకున్నామని పశువైద్యాధికారులు తెలిపారు. మండలంలోని ఏర్పేడు,పాపానాయుడుపేట పరిధిలోని రైతులకు 50శాతం సబ్సిడీలతో పంపిణీ చేయనున్నట్లు డాక్టర్లు శిల్పారెడ్డి, డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డిలుశనివారం తెలిపారు. 50కిలోల బస్తా రూ.1110 లు కాగా ఎస్‌సి,బిసిరైతులకు కేవలం రూ.550లకే అందిస్తున్నట్లు వివరించారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో మండల తెలుగు దేశం నాయకులు పేరం ధనంజయులునాయుడు,రెడ్డివారి గురువారెడ్డి, పొన్నరావు, పేరం నాగరాజు నాయుడు,శివశంకర్‌రెడ్డి, బాల గుర్నాథం,కృష్ణవేణి,సుబ్రమణ్యం,కేశినేని సుబ్రమణ్యం,రవినాయుడు తదితరులుపాల్గొన్నారు. మండలంలోని ఏర్పేడు,పల్లం, ఎండిపుత్తూరు పశువైద్యకేంద్రాల్లో సబ్సీడీదాణ లభిస్తుందన్నారు.

## శివయ్యసేవలో భానుప్రకాష్



**శ్రీకాళహస్తి,మే 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం నగరి శాసనసభ్యుడు గాలి భానుప్రకాష్ కుటుంబసభ్యులతో పూజలు జరుపుకు న్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్‌మేరకు విద్యాసాగర్‌రెడ్డి,సతీష్‌మాలిక్‌లు వేదపండితులతో స్వాగతం పలికారు. ఏర్పాట్లును ఆలయ పిఆర్‌ఓ రవి, టెంపుల్‌ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ పర్యవేక్షించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయదర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు స్వామిఅమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## తట్టల వితరణ:



**శ్రీకాళహస్తిరూరల్,మే 10 ప్రభాతవార్త** ఏర్పేడుమండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయంలో భక్తుల భాగస్వామ్యం పెరుగుతుంది. అంతే కాక విరాళాలతోపాటుహుండీ రాబడి కూడా పెరుగుతుంది. ఈ నేపధ్యంలో శనివారం తిరుపతికి చెందిన కావ్య 30 భోజనప్లేట్లను వితరణగాఅందించారు. ఈ ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు అందిస్తున్నారు.ఈ కార్యక్రమాల్లో ఆలయమాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు ఆలయకార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

## ఆచారాలకు ప్రాధాన్యత ఇవ్వండి: శాంతి భద్రతలు పరిరక్షించండి

డివైయస్‌పికి వినతి



**శ్రీకాళహస్తి,మే 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలో వేసవి కాలంలో నిర్వహించే బిపి అగ్రహారం గంగమ్మ జాతరకు అత్యంత ప్రాధాన్యత ఉందని తిరుపతి తాతయ్యగుంట జాతరతో పాటు జరిగే జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతారని కాబట్టి జాతరలో గతంలో పోలీసు శాఖ ఆచరించే విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని శనివారం అగ్రహారానికి చెందిన యువకులు డివైయస్‌పి నరసింహామూర్తికి అభ్యర్థించారు. ఈమేరకు యువకులు వినతి పత్రం సమర్పించారు. దుశ్శాలువతో సత్కరించారు.ఈ నెల 13,14తేదుల్లో అగ్రహారం గంగమ్మ జాతరకు సుమూహూర్తం ఖరారు చేసారన్నారు.పూర్వ కాలం నుంచి ఇక్కడ కొన్ని సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు అచరిస్తున్నారని డివైయస్‌పికి వివరించారు. అయితే ఈ సంప్రదాయాన్ని భంగం చేయటానికి కొందరు ప్రయత్నిస్తున్నారని ప్రశాంత వాతావరణంలో జాతర నిర్వహణకు సహాయరించాలని యువకులు డివైయస్‌పిని కోరారు. తెలుగుదేశం నాయకుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి జాతర కమిటి సభ్యులు పాల్గొన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడేది లేదని జాతరలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని డివైయస్‌పి నరసింహామూర్తి యువకులకు భరోసా ఇచ్చారు.

## యాంకర్‌కు శివయ్య ప్రసాదాలు

శ్రీకాళహస్తి,మే 10 ప్రభాతవార్త



ప్రముఖ యాంకర్ శ్రీముఖికి శనివారం ఆమె అభిమానులు శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి అమ్మవార్లచిత్రపటాన్ని అందించారు. శ్రీముఖి కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని తిరుగుపయనంలో విమానాశ్రయం వద్ద శ్రీకాళహస్తికి చెందిన ఆమె అభిమానులు శ్రీకాళహస్తీశ్వరుని ఆలయంలో పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలను అందించారు.

## ఒంటి కాళ్ళ జపం:మేకపోతు గాంభీర్యం:సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి,మే 10 ప్రభాతవార్త



ఏ మాత్రం బలం లేని పాకిస్తాన్ ఇండియాపై కవ్వింపు చర్యలకు పాల్పడటం తీవ్రవాదాన్ని పెంచిపోషించటం దారుణమని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత దేశం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా భారత దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయుటకు ప్రధాని కీలక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. భారత దేశంలో క్షమా గుణం ఉంటుందన్నారు. పాకిస్తాన్ తీవ్ర వాదాన్ని పెంచి పోషిస్తున్నా ఎన్నో సంఘటనల్లో భారత ప్రధాని ఓర్పు సహనం వహించారన్నారు.అయితే ఇటీవల పహల్ గావ్ వద్ద తీవ్ర వాదులు అమాయకుల ప్రాణాలను తీయటంను జీర్ణించుకోలేక పోయారన్నారు.ఓర్పు సహనానికి ఓ హద్దు ఉంటుదన్నారు. అన్ని రంగాల్లో పటిష్టంగా ఉన్న భారత దేశంతో పాకిస్తాన్ పోటీ పడటం యుద్దానికి తలపడటం గమనిస్తే ఆ దేశ పరిస్థితి 'ఒంటి కాళ్ళ మీద జపం, మేకపోతు గాంభీర్యం'అని చెప్పవచ్చునన్నారు. యుద్దమే జరిగితే పాకిస్థాన్ తుడిచి పెట్టుకుపోతుందన్నారు. మన అణ్వాస్త్రాల ముందు పాకిస్తాన్ నిలవ గలదా? అని సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు.

## ముక్కంటి సేవలో మాడుగుల ఎంఎల్‌ఏ



**శ్రీకాళహస్తి,మే 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం వేసవి సెలవులతో ఓ మోస్తరు భక్తులతో కళ కళ లాడుతుంది. ఈ నేపధ్యంలో శనివారం విశాఖ పట్టణం జిల్లా మాడుగుల ఎంఎల్‌ఏ బండారుసత్యనారాయణ మూర్తి కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి దక్షిణగోపురం వద్ద తెలుగుదేశం మీడియా ప్రతినిధి నాగమల్లి దుర్గాప్రసాద్ సారధ్యంలో స్వాగతం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## అంగన్ వాడిల్లో కిషోర్ వికాసం

శ్రీకాళహస్తిరూరల్, మే 10 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం రావిళ్ళవారి కండ్రిగ,ఎండిపుత్తూరు సచివాలయాల్లోని అంగన్‌వాడి కేంద్రాల్లో శనివారం కిషోర్ వికాస కార్యక్రమాలనునిర్వహించారు. ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ సచివాలయ సిబ్బంది సంయుక్తంగానిర్వహించిన కార్యక్రమాల్లో ప్రగతి సంస్థ సామాజిక కార్యకర్త సుమలత గ్రామస్తులను చైతన్యపరుస్తూ బాల్యవివాహాలతో ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటాయన్నారు. కాబట్టి యుక్త వయస్సు వచ్చే వరకు వివాహాలను చేయరాదని వివరించారు.ఈ సందర్భంగా ఆమె చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి ఫోక్సో యాక్ట్ గురించి గ్రామంలోని మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే కిషోర్ బాలికలకు యుక్త వయస్సుల్లోవచ్చే మార్పులను గురించి వారు తెలుసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి యుక్త వయస్సులో ఐరన్ కంటెన్ట్స్ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు.ఈ చైతన్య సమావేశంలో అంగన్‌వాడి టీచర్ అంకమ్మ, విమల కుమారి, విజయ,కమలమ్మ, పద్మిని ఆశావర్కర్లు హెల్త్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, ఎఎన్‌ఎం ధనలక్ష్మీ,ఎంఎస్ ఇంద్రాణి తదితరులు హాజరయ్యారు.ఆ సందర్భంగా గ్రామంలో ర్యాలి నిర్వహించారు.

## చెర్లోపల్లిలో జాతీయ ఎఐవైఎఫ్ మహాసభల ప్రచారం

శ్రీకాళహస్తి రూరల్,మే 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లి గ్రామంలో శనివారం అఖిల భారత యువజన సమాఖ్య జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ శాఖ ర్యాలి నిర్వహించారు. ఈనెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో అఖిల భారత యువజనసమాఖ్య జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లునాయకులు వివరించారు. గ్రామానికిచెందిన యువకులచే కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ మహాసభలకు దేశ నలుమూలల నుంచి విశేష సంఖ్యలో ప్రతినిధులు హాజరౌతారన్నారు. ప్రభుత్వం రంగంలో ఉన్న సంస్థలను ప్రవైటు పరం చేయాలన్న ఆలోచన తగదన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా పోస్టులను భర్తీ చేయక నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని ధ్వజమెత్తారు.ఈకార్యక్రమాల్లో కోగిల మునిచంద్ర,మధు, ఉపేంద్ర,ధనూష్,సాయి.మహేంద్ర, మహేష్,పులిమణి, సుకుమార్, ప్రసన్న తదితరులుపాల్గొన్నారు.

# సిజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు

## - ఎంపీ గురుమూర్తి లేఖకు కేంద్ర ఆరోగ్య శాఖ స్పందన



వెంకటగిరి, మే 10 ప్రభాతవార్త : సిజీహెచ్ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి కీలక పురోగతి నమోదైంది. తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దిల గురుమూర్తి గత ఏప్రిల్ 4వ తేదీన కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు లేఖ రాశారు. ఈ లేఖకు స్పందనగా మంత్రిత్వశాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో దేశవ్యాప్తంగా కొత్తగా 22 సిజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించేందుకు కేంద్రం ఇప్పటికే ఆమోదం తెలిపిందని స్పష్టం చేసింది. వీటిలో తిరుపతిలో స్థాపించనున్న వెల్‌నెస్ సెంటర్ కూడా ఒకటిగా పేర్కొంది. తద్వారా తిరుపతిలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు మార్గం సుగమమవుతోంది. తిరుపతిలో సిజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కోసం నిరంతర కృషి చేస్తున్న ఎంపీ గురుమూర్తికి అదనపు కార్యదర్శి రోలి సింగ్ అభినందనలు తెలియజేశారు. ఈ క్రమంలో సిబ్బంది నియామకాలకు సంబంధించి వ్యక్తిగత శిక్షణ విభాగం నుంచి అవసరమైన అనుమతులు ఇప్పటికే మంజూరయ్యాయని మంత్రిత్వశాఖ తెలిపింది. ఇక, వెల్‌నెస్ సెంటర్ నిర్వహణకు అవసరమైన నిధుల మంజూరుకు సంబంధించి ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుబంధ విభాగం అయినటువంటి ప్రభుత్వ ఖర్చులను పర్యవేక్షించడం, సమర్థవంత మైన విధంగా ఖర్చు జరిగేలా చూసే వ్యయ విభాగానికి (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్) ఆర్థిక అనుమతుల కోసం ప్రతిపాదన పంపబడిందని తెలియజేశారు. ఈ ప్రకటన నేపథ్యంలో ఎంపీ మాట్లాడుతూ కేవలం విజయవాడ, నెల్లూరు, విశాఖ పట్టణం మరియు గుంటూరుకి మాత్రమే పరిమితమైన సి.జి.హెచ్.ఎస్ వెల్ నెస్ సెంటర్ తిరుపతిలో ఏర్పాటు వలన దాదాపు 15 వేల మంది కేంద్ర ప్రభుత్వ సంస్థాగత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పదవీ విరమణ పొందినవారు ఉన్నారని వారికి సరైన వైద్యం, రిఫరల్ సౌకర్యాలను పొందేందుకు వారికి సులభతరం అవుతుందని తెలిపారు. ఎంప్యానెల్ సౌకర్యాలలో నమోదు చేసుకున్న సభ్యులందరికీ ఇన్‌పేషెంట్ చికిత్స, ఎంపానెల్డ్ హాస్పిటల్స్ మరియు డయాగ్నస్టిక్ సెంటర్లలో నగదు రహిత చికిత్స అందించబడుతుందని తెలియజేశారు.

# గూడూరు డివిజన్

## పీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయాలి



గూడూరు, మే 10 ప్రభాతవార్త: 2024-25 విద్యా సంవత్సరంనకు సంబంధించి విద్యార్థులకు స్కాలర్ షిప్పు, పీజు రీయంబర్స్మెంటు వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి, సుబ్బారామరాజు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ నిర్ణయాత్మక చర్య : బోలా శీను



చిట్టమూరు, మే 10 ప్రభాతవార్త : పహల్గాంలో హిందూ పర్యాటకులపై అనాగరికంగా దాడి చేసిన ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ అనే నిర్ణయాత్మక చర్యతోపాటు సాయుధ దళాలు వేగంగా స్పందించి, రంగంలోకి దిగడాన్ని యావత్ భారతదేశ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఉమ్మడి జిల్లాల భాజపా జిల్లా నేత తిరుపతి పార్లమెంటు సభ్యులు బోలా శ్రీనివాసులు తెలిపారు. శనివారం చిట్టమూరుకు విచ్చేసిన బోల ప్రభాతవార్తతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా భారత దేశ నాయకత్వాన్ని దేశ ప్రజలు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారన్నారు. పహల్గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన పిరికిపంద దాడి తర్వాత పాక్ ప్రాయోజిత ఉగ్రవాదులు, వారికి వత్తాసు పలికే వ్యవస్థపై ఆపరేషన్ సిందూర్‌తో కేంద్రం నిర్ణయాత్మక చర్యలకు కేంద్ర ప్రభుత్వాన్ని, భారత సైన్యాన్ని అభినందిస్తున్నామన్నారు. అలాగే ఈ క్రూరమైన, అమాన వీయమైన దాడులలో బాధితులైన కుటుంబాలకు భారతీయులందరూ హృదయ పూర్వక సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారని బోలా సందర్భంగా తెలియజేశారు.

## టిడిపి కార్యకర్తలు అండగా ఉంటుంది : ఎమ్మెల్యే



బాలాయపల్లి, మే 10 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు గోళ్ళ మహేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పార్టీ సభ్యత్వ నమోదు ఉన్నందున ఐదు లక్షల రూపాయల బీమా చెక్కును ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు అందజేశారు. మహేష్ కుటుంబానికి ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, మాజీ ఏం సి చైర్మన్ నాయుడు, కాస్త ఇంచార్జి రాయి సత్యం నాయుడు, నాయకులు గోళ్ళ మధు, ఆది వెంకట కృష్ణారెడ్డి, దాసరి కోటి, కూని శ్రీహరి, దాసరి రాజగోపాల్ నాయుడు, తదితరులు ఉన్నారు.

## రామ్మోహన్‌రావు సేవలు అభినందనీయం.



గూడూరు, మే 10 ప్రభాతవార్త: పట్టణంలోని ఓం శ్రీ వృద్ధ ఆశ్రమంలో ప్రముఖ సీనియర్ ఆడిటర్ కంటి రామ్మోహన్‌రావు తన సొంత నిధులతో ఫ్రిడ్జ్‌ను అందచేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న దానం నిర్వహించారు. అనంతరం గూడూరు రెండో పట్టణంలోని మాలవ్య నగర్ కూడలి ప్రాంతంలో ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం గూడూరు గౌరవ అధ్యక్షులు, ప్రముఖ సీనియర్ ఆడిటర్ రామ్మోహన్ రావు అల్లుడు దూర్వాసుల కామేశ్వర్ పుట్టిన రోజు సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బాలాజీ, కార్యదర్శి ఐ.పవన్ కుమార్, కోశాధికారి పవన్ కుమార్, ఉపాధ్యక్షులు జనార్ధన్ రావు, నారాయణ, జాయింట్ సెక్రటరి కాశీవిశ్వేశ్వరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

## తీర ప్రాంతాల్లో ప్రజల అప్రమత్తంగా ఉండాలి : డిఎస్పి



వాకాడు, మే 10 ప్రభాతవార్త : మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో విద్వేషపూరితమైన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేస్తే వారిపై కఠినమైన చర్యలు తప్పవని గూడూరు డిఎస్పి గీతా కుమారి పేర్కొన్నారు. శుక్రవారం సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం లేదా నకిలీ వార్తలను చూసినప్పుడు, వాటిని ముందుగా ధృవీకరించుకోకుండా వేరే వారికి పంపకండి. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని తక్షణమే నమ్మకండి. తప్పుడు సమాచారం ప్రజల మధ్య గొడవలు, భయం, గందరగోళానికి దారితీయవచ్చు. తప్పుడు సమాచారం లేదా తప్పుడు ప్రచారం అని తెలిసినప్పుడు వెంటనే మీ దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీస్ వారి ఆదేశాలను ఉల్లంఘించి, అవాస్తవమైన, విద్వేషపూరితమైన మెసేజ్లను, ఆడియో, వీడియోలను షేర్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడునన్నారు. వాకాడు మండలం సముద్ర తీర ప్రాంతాలలో గూడూరు డిఎస్పి గీతా కుమారి వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ నాగబాబు సుడిగాలి పర్యటన చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ప్రస్తుతం మన దేశంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా తీర ప్రాంత ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు డిఎస్పీ గీతా కుమారి, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజల పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని భారత్ తుద ముట్టిస్తుంది : ఎమ్మెల్యే



వెంకటగిరి, మే 10 ప్రభాతవార్త : ఆపరేషన్ సింధూర్‌లో భారత సైనికులు క్షేమంగా ఉండాలని వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పోలేరమ్మ ఆలయంలో భారత సైనికులు క్షేమంగా పోరాడాలని ఎమ్మెల్యే, టిడిపి నాయకులు పూజ నిర్వహించారు. భారత సైనికులు పాకిస్థాన్‌తో దీటుగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. పాకిస్తాన్ ఎత్తులను భారతదేశ చిత్తు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని తుది ముట్టిస్తుందని తెలిపారు. వెంకటగిరి పట్టణం బంగారు పేటకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త అనసూయమ్మ గ్యాస్ సిలిండర్ పేలి చనిపోవడంతో ఐదు లక్షల రూపాయల పార్టీ బీమా చెక్కును ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ మాజీ చైర్పర్సన్ దొంతు శారద, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళిరెడ్డి, నాయకులు విశ్వనాథం, దొంతు బాలకృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను పిల్లలు గౌరవించాలి : సిడిపిఓ



వెంకటగిరి, మే 10 ప్రభాతవార్త: తల్లిదండ్రులను పిల్లలు గౌరవించాలని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా తల్లుల పాదాలను కడిగి పిల్లలు పూజించారు. అంగన్వాడి కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించినట్లు సిడిపిఓ తెలిపారు. వృద్ధాప్యంలో కూడా తల్లిదండ్రులను పిల్లలు ప్రేమగా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కల్పలత తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి వైపు...దొంతు శారద చూపు



వెంకటగిరి, మే 10 ప్రభాతవార్త: జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్పర్సన్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్, ప్రస్తుత కౌన్సిలర్ అయిన దొంతు శారద తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. 2014 సంవత్సరంలో ఆమె తెలుగుదేశం పార్టీలో చేరి మున్సిపల్ చైర్పర్సన్ అయ్యారు. 2019లో వైసీపీలో చేరి, మరలా దొంతు దంపతులు తెలుగుదేశం పార్టీ ఆయన సొంత గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఎమ్మెల్యే కోరుకొండ రామకృష్ణ కార్యక్రమాల్లో దొంతు శారద, బాలకృష్ణ పాల్గొంటున్నారు. ఆమెతో పాటు పలువురు వైసిపి వారు టిడిపిలో చేరనున్నారు.

## ఆపరేషన్ సింధూర అంటే ఏమిటి తెలిస్తే కన్నీళ్లు ఆగవు



గూడూరు, మే 10 ప్రభాతవార్త : ఆపరేషన్ సింధూర అంటే ఏమిటి అని తెలిస్తే కన్నీళ్లు ఆగవని నియోజకవర్గ కన్వీనర్, రాష్ట్ర అగ్ని విద్యుత్ కో కన్వీనర్ గాలి ప్రకాష్ నాయుడు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మన హిందూ మహిళలకు అత్యంత పవిత్రమైన సింధూరాన్ని పోగొట్టిన ఉగ్రవాదులను సంహరించడానికి పెట్టిన పేరు ఆపరేషన్ సింధూర్ పేరును స్వయంగా మన భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీపెట్టారన్నారు. ఈ దేశంలోనివారు ప్రతిఒక్కరు భారత్ మాతాకీ జై కొట్టాలన్నారు.

## కాపులూరులో సాగరమాల నిర్వాసితులు ధర్నా

నాయుడుపేట, మే 10 ప్రభాతవార్త : మండలంలోని కాపులూరు గ్రామంలో సాగరమాల జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాలని శనివారం రైతుల ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కాపులూరు గ్రామస్తులు గోవర్ధన్ మాట్లడుతూ సాగరమాల రోడ్డుకు సంబందించి 10ఎకరాల విస్తీర్ణంలో 26మంది రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకుండ రోడ్డును నిర్మిస్తున్నారని రైతులు ఆరోపించారు. మాకు నష్టపరిహారం అందించే వరకు రోడ్డుకు అడ్డంగా టెంటువేసుకొని ధర్నా చేపడుతామని తెలియజేశారు. సాగరమాల జాతీయ రహదారి నిర్మాణం పూర్తికావస్తున్న తమకు నష్టపరిహారం ఇంతవరకు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండ సాగరమాల జాతీయ రహదారికి సర్వీసురోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## సామూహిక ఉచిత ఖత్నా కార్యక్రమం



గూడూరు, మే 10 ప్రభాతవార్త: రెండవ పట్టణంలోని అక్సా మసీదులో శనివారం నూతన సాంకేతిక లేజర్ పరిజ్ఞానంతో సామూహిక ఉచిత ఖత్నా (ఒడుగుల) కార్యక్రమాన్ని నిర్వహించారు. గూడూరు పట్టణ, పరిసర ప్రాంతాల నుండి సుమారు 50 మంది నిరుపేద ముస్లిం చిన్నారులు హాజరై ఖత్నా చేయించుకున్నారు. మసీదు ఆవరణంలోనే చిన్నారులు, వారి తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు కరీముల్లా, మసీదు ముతవల్లి (ఛైర్మన్) షేక్ చాన్ బాష, కరీముల్లా, ఇమామ్ షఫీ మోలానా, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ముతవల్లి చాన్ బాష, నిర్వాహకులు కరీముల్లా, సెక్రటరీ తమీమ్ భాయ్, అక్సా మసీదు ఇమామ్ షఫీ మోలానా, ఆస్కార్ ఇలియాజ్, మోజన్‌లు సిరాజ్, హిదాయతుల్లా, అయ్యూబ్, మసీదు కమిటీ సభ్యులు, కార్యనిర్వాహక యువత అలీ, అజ్గర్, చిన్నారుల, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ప్రాంగణ ఎంపికలు



కోట, మే 10 ప్రభాతవార్త: మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో శనివారం మేడిన్ కంపెనీ ప్రతినిధులు బిటెక్ ఆఖరు సంవత్సరం చదువుతున్న ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఎలక్ట్రికల్ విభాగం నుంచి 30 మంది, మెకానికల్ విభాగం నుంచి పదిమంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ 40 మంది విద్యార్థులకు నెలరోజులు పాటు ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్ పూర్తయిన తర్వాత రాతపరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. చివరగా ఎలక్ట్రికల్ విభాగం నుంచి ఆరుగురు, మెకానికల్ విభాగం నుంచి ఒకరు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు రూ.3.6 లక్షలు చొప్పున సంవత్సరం వేతనం ఇస్తారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పేటలో శ్రీకరిమాణిక్య స్వామి బ్రహోత్సవాలు ప్రారంభం



నాయుడుపేట, మే 10 ప్రభాతవార్త : పట్టణంలోని తుమ్మూరులో వెలసియున్న శ్రీభూదేవి శ్రీదేవి సమేత శ్రీకరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంకురార్పణతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థాన వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా టిటిడి ఇన్స్‌పెక్టర్ హరి మాట్లడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీకరిమాణిక్య స్వామి బ్రహ్మోత్స వాలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

## భారత్ పాక్ కాల్పుల విరమణపై సర్వత్రా హర్షం

పెళ్లకూరు, మే 10 ప్రభాతవార్త : భారత్ పాకిస్తాన్ల మధ్య కాల్పుల విరమణ జరిపిన నేపథ్యంలో మండల వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా శనివారం తాల్వాయిపాడు గ్రామం వీర్లయ్య స్వామి ఆలయంలో యుద్ధంలో అసువులు బాసిన సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో గంగా బత్తిన రామకృష్ణ నేలవల్లి సిద్ధయ్య నాయుడు, గంగాబత్తిని శ్రీనివాసులు పాల్గొన్నారు.

## తీరం వెంబడి గట్టి నిఘా

కోట, మే 10 ప్రభాతవార్త : ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తిరుపతి జిల్లా పోలీసు శాఖ, మెరైన్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆదేశాల మేరకు తీర ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టినట్లు మెరైన్ ఎస్ఐ సౌమ్య చెప్పారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని తీరప్రాంతాల్లో గట్టినిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కోస్ట్‌గార్డ్, ఇతర భద్రత సంస్థలతో సమన్వయం చేసుకుంటూ లైట్‌హౌస్, తీరప్రాంత గ్రామాల్లో మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవడంతో పాటు తీరానికి ఇతర ప్రాంతాలకు వచ్చిన పడవలు, ఒడలు, అనుమానాస్పద వ్యక్తులు ఎదురుపడితే మెరైన్, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## తిన్నెలపూడిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కోట, మే 10 ప్రభాతవార్త : మండలం తిన్నెలపూడి గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐదు ప్రధాన పంటల విత్తనాల బంకమట్టి, ఘన జీవామృతం, బూడిద కలిపి 16 రకాల విత్తనాలు చల్లడం వలన విత్తనం చెడిపోకుండా వర్షం పడిన వెంటనే మొలకెత్తుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ శ్రీనివాసులు, పద్మ, శివకుమారి పాల్గొన్నారు.

## పాముకాటుకు దివ్యాంగురాలు మృతి

కోట, మే 10 ప్రభాతవార్త: మండలం గూడలి గ్రామంలో ఓ దివ్యాంగురాలు శుక్రవారం రాత్రి పాము కాటుకు గురై మృతిచెందింది. ప్రతిరోజు భిక్షాటన చేస్తూ ఆలయ సమీపంలో ఆమె నిద్రించేది. ఈ క్రమంలో శుక్రవారం ఆమె ఆలయంలో నిద్రిస్తుండగా పాముకాటుకు గురయింది. స్థానికుల సమాచారంతో 108 సహాయంతో కోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఆమె అనాధ కావడంతో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు దహనక్రియలు చేశారు.

## వైభవంగా గంగమ్మ జాతర



కోట,మే 10 ప్రభాతవార్త : చల్లని చూపుల తల్లి గంగమ్మ..తనకెంతో ప్రతీకరమైన మధురమైన బెల్లం పొంగలిని ఆరగించారు. వెంకన్నపాళెంలో గంగమ్మ జాతర వేడుక చాటింపు తర్వాత గ్రామ దేవతలకు బెల్లం పొంగలిని నైవేద్యం సమర్పించడం సంప్రదాయం. ఈ సందర్భంగా శనివారం ఆలయం వద్ద అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున పొంగళ్ల సమర్పించారు. కట్టెల పోయ్యిపై పొంగలి వండి అమ్మవారికి సమర్పించారు. పండరి భజనలు కోలాటాలుతో వెంకన్నపాళెం గ్రామంలో సందడి నెలకొంది. పంబజోళ్లు, మంగళవాయిద్యలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకటలాడింది.

## వేషాలతో గంగమ్మకు రంగస్థలి మొక్కులు



తిరుపతి(రవాణ)మే 10 ప్రభాతవార్త: తాతయ్యగుంట గంగమ్మజాతర వేడుకల్లో బాగంగా శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ రకాల వేషధారణలతో అమ్మవారి ఆలయంకు చేరుకున్నారు. టిటిడి సారెతోబాటు కళాకారులు రకరకాల వేషాలతో అమ్మవారిని ఆలయం వరకు ప్రదర్శనగా చేరారు. ఆలయంలో ఆలయ ఈఓ జయకుమార్ స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు.

## వరసిద్ధుని సన్నిధిలో సమాచార హక్కు చట్టం కమీషనర్



కాణిపాకం, మే 10 ప్రభాతవార్త: రాష్ట్ర సమాచార హక్కు కమీషనర్ చావలి సునీల్‌కుమార్ శనివారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోసంరక్షణ ట్రస్ట్‌కు రెండు లక్షలు విరాళం



కాణిపాకం, మే 10 ప్రభాతవార్త: శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం లో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఇద్దరు భక్తులు శనివారం రెండు రూపాయలను వేర్వేరుగా విరాళంగా అందించారు. ఈమేరకు చెన్నై ఊకు చెందిన కలవకుంట ప్రత్యోష్ ఈపథకానికి 1,01.116 విరాళంగా చెక్ రూపంలో అందజేశారు. ఈమొత్తాన్ని దాతలు కుటుంబ సభ్యులతో కలసి ఆలయాధికారి కోదండ పాణికు అందజేశారు. అలాగే గుంటూరు జిల్లా పొన్నూ రుకు చెందిన సూరిశెట్టి రమేష్ అనే దాత ఈపథకానికి 1,01,116 రూపా యలను విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



నారాయణవనం, మే 10 ప్రభాతవార్త : పద్మావతిదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి టిటిడి అధికారులు చేసిన ఏర్పాట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గతంలో విధంగానే టిటిడి అధికారులు కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలను తిరుమల తరహాలో ఉత్సవాలను జరపడం కోసం చేసిన ఏర్పాట్లను చూసి భక్తులు మురిసిపోతు న్నారు. శనివారం రాత్రి కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు సంబందించి అంకురార్పణ ఘనంగా నిర్వహించారు. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు సంబందించి ఎలాంటి ఆటంకం కలగకుండా దగ్గరుండి సేనాధిపతి జరపుతారన్నది ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, సివిల్ ఇంజనీర్ ఎఇఇ గురుప్రసాద్, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు శ్రీధర భటాటచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, శ్రీనివాస భట్టాచారయ, సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు ధ్వజారోహణం :**

కల్యాణవేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి మంగళవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహించడం జరుగుతుందని టిటిడి అధికారులు తెలిపారు.

## కైలాసనాధకోనలో ఘనంగా అగస్తీశ్వరుని చక్రస్నానం



నారాయణవనం, మే 10 ప్రభాతవార్త : మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన మరదగవల్లీ సమేత అగస్తీశ్వరున్ని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదవరోజు శనివారం ఉదయం కైలాసనాధకోన జలపాతంలో చక్రస్నానం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని, స్వామివారిని ట్రాక్టర్‌పై అధిరోహించి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ రవి, సూపరిడెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, అర్చకులు రమేష్ గురుకుల్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెహల్గామ్‌లో ఎన్సీసి విద్యార్థుల ధైర్యసాహసం



తిరుపతి విద్య, మే 10 ప్రభాతవార్త : కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడి సమయంలో తిరుపతికి చెందిన ఎస్వీ వెటర్నరీ ఎన్సీసీ క్యాడెట్లు ప్రదర్శించిన ధైర్యసాహసం అభినందనీయం .ఎన్సీసీ విద్యార్థుల పర్వతారోహణ శిక్షణలో భాగంగా తిరుపతి 2ఏ ఆర్ అండ్ వీ ఎన్సీసీ రెజిమెంట్ పరిధిలో వెటర్నరీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రెక్కింగ్ కు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శిక్షణ ఏప్రిల్ 18వతేదీ నుంచి ఈనెల 2వ తేదీవరకు జమ్మూ కాశ్మీర్ సనాసర్లోని పహల్గామ్ అడ్వెంచర్ క్యాంప్లో జరిగే శిక్షణకు హాజరయ్యారు. ప్రతిష్టాత్మక జవహర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ ఆధ్వర్యంలో నిపుణులైన ట్రెక్కింగ్ అధికారులచే ఇంటెన్సివ్ శిక్షణ పొందుతున్నారు. పర్వతారోహణ చేస్తున్న సమయంలో పహల్గామ్లో యాత్రికులను, పౌరులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడి చేశారు.

## హంస వాహనంపై ఊరేగిన శ్రీవారు



సదుం, మే 10 ప్రభాతవార్త : మండల పరిధిలో బూరగ మంద గ్రామంలో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారని హంస వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఉబయదారులుగా పూజారి వెంకటరమణ, కుటుంబ సభ్యులు వ్యవహరించగా మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ప్రభాకర్ రెడ్డి, కర్ణ వెంకటరమణ, కర్ణ మున్రాజ లేదా తదితరులు పాల్గొన్నారు. జూనియర్ అసిస్టెంట్ రాజేష్ ఆధ్వర్యంలో టీటీడీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పీజీఆర్ఎస్‌లో మీ సమస్యలు చెప్పుకోండి : కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, మే 10 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు 12న సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు డివిజనల్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందన్నారు. డివిజన్, మండల కేంద్రాల్లో వారి వారి పీజీఆర్ఎస్‌కు ఆయా శాఖాధికారులకు అందించాల్సి ఉంటుందని తెలియజేశారు. డివిజన్, మండల కేంద్ర స్థాయిల్లో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## సిరులు కురిపించే చిరుధాన్యాల పంటలు



తొట్టంబేడు, మే 10 ప్రభాతవార్త : మహిళా ఆర్థిక స్వావలంభనకు సిరులు కురిపించే చిరుధాన్యాల పంటలు ఒక్కటే అని వీటితోనే ఆర్థికంగా ఎంతో ఎత్తుకు ఎదగవచ్చని డిఆర్‌డిఏ పిడి టిఎన్.శోభన్‌బాబు తెలిపారు. విస్తరణ శిక్షణ కేంద్రంలో నిర్వహించి చిరుధాన్యాల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలు వాటి ఆరోగ్య ప్రయోజనాలకు ప్రసిద్ధిచెందాయి. మరియు బియ్యానికి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా ప్రజాధరణ పొందుతున్నాయి. వీటికి సంబందించి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటిసి)లో 9 జిల్లాలైన కడప, కర్నూలు, చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన చిరుధాన్యాల ఉత్పత్తి దారులు రైతులు, ప్రాసెసర్లు, సెర్ప్ అధికారులు హజరయ్యారు. చిరుధాన్యాలతో తయారుచేసిన పలు రకాల వంటకాలను రుచి చూపించారు.